
# పోతనభాగవతంలో రసగుళికలు

– ఆర్.శర్మ దంతుర్తి



## 132 వ భాగం

## మత్స్యావతారం - 4

ఇలా శ్రీహరి మీనరూపంలో కనిపించాక ఆ చేప కొమ్ముని నావని కట్టాడు. మొదట భగవంతుణ్ణి తనని అనుగ్రహించినందుకూ, తనకి కనిపించినందుకు పొగిడి సద్గతి కావాలి కనక చెప్తున్నాడు, సత్యవ్రతుడు.

మ. చెలివై చుట్టమవై మనస్థ్సితుఁడవై చిన్మూర్తివై యాత్మవై
వలనై కోర్కులపంటవై విభుఁడవై వర్తిల్లు నిన్నొల్లకే
పలువెంటంబడి లోక మక్కట; వృథా బద్ధాశమై పోయెడిన్
నిలువన్ నేర్చునె హేమరాశిఁ గనియున్ నిర్భాగ్యుఁ డంభశ్శయా! [8-729]

నిర్భాగ్యుడు బంగారం (హేమరాశి) కనబడితే పరుగులు పెడుతూ ఒకచోట ఉండలేడు/పూర్తిగా దక్కించుకోలేడు. అయితే దానికన్నా విలువైన భగవంతుడివైన నువ్వు (అంభశ్శయా, నీటిలో పరుండేవాడు, లేదా పాలసముద్రంలో శేషతల్పం మీద ఉండేవాడు, విష్ణువు) ఆత్మరూపిగా, స్నేహితుడిగా (చెలివై), చుట్టంగా, మనస్సులో ఉన్నా, అన్ని కోరికలూ తీర్చేవాడివైనా నిన్ను పట్టించుకోడు. నిజమే కదా, భగవంతుడు ఆత్మ స్వరూపంలో మనలోనే ఉన్నా, ఇది కావాలి అది కావాలి అంటూ పరుగులు పెట్టే వారే అందరూను. ఇదే రమణులు 'నువ్వెవరివి అనేది తెలుసుకో' చెప్పే తత్వం.

వ. అని యిట్లు సత్యవ్రతుండు పలికిన సంతసించి మత్స్యరూపంబున మహాసముద్రంబున విహరించు హరి పురాణపురుషుం డగుటం జేసి సాంఖ్యయోగక్రియాసహితయగు పురాణసంహిత నుపదేశించె; నమ్మహారాజు ముని సమేతుండై భగవన్నిగదితంబై సనాతనంబగు బ్రహ్మస్వరూపంబు విని కృతార్థుం డయ్యె; నతం డిమ్మహాకల్పంబున వివస్వతుండనం బరఁగిన సూర్యునకు శ్రాద్ధదేవుండన జన్మించి శ్రీహరి కృపావశంబున నేడవ మనువయ్యె; నంత

నవ్విధంబున బెనురేయి నిండునంతకు సంచరించి జలచరాకారుండగు నారాయణుండు తన్నిశాంత సమయంబున.

[8-732]

సత్యవ్రతుడు ఇలా బ్రహ్మజ్ఞానం గురించి అడిగేసరికి పురాణ పురుషుడు – అన్నింటికీ మూలమైనవాడైన భగవంతుడు – సనాతనమైన సాంఖ్యయోగ క్రియా సంహితమైన బ్రహ్మజ్ఞానం ఉపదేశించాడు. ఇది భగవంతుడే చెప్పాడు కనక సనాతనమైనది. బ్రహ్మజ్ఞానం కలిగితే జరిగేది బ్రహ్మవిద్ బ్రహ్మైవభవతి. లేదా ముక్తి, దానితో అన్ని దుఃఖాలకీ అంతం. ఈ సత్యవ్రతుడే వైవస్వతుడనే మనువు అయ్యాడు అదీ కూడా శ్రీహరి కృపతో. ఇదే శుకమహర్షి చెప్తాడు, వామనావతారం కథలో – ఎవర్ని ఎక్కడ ఏ విధంగా ఉంచాలో అక్కడ ఉంచినా ఆయనే ఇదంతా; అందువల్ల "విష్ణుదవ్యయుండు విమలచరిత," అని. అందుకే ఈ విశ్వం అంతా కూడా బ్రహ్మం తప్ప మరోటి కాదు లేదా సర్వం ఖల్విదం బ్రహ్మ. మన మన్వంతరం పేరు కూడా మంత్రాలలో చెప్పడం గమనించవచ్చు – 'వైవస్వత మన్వంతరే, కలియుగే ప్రథమ పాదే' అంటూ.

మ. ఉఱ కంభోనిధి రోసి వేదముల కుయ్యున్ దైన్యముం జూచి వేఁ
గఱ లల్లార్చి ముఖంబు సాఁచి బలువీఁకందోఁక సారించి మే
న్మెఱయన్ దౌడలు దీటి మీస లదరన్ మీనాకృతిన్ విష్ణుఁ డ
క్కఱటిం దాఁకి వధించె ముష్టిదళితగ్రావున్ హయగ్రీవునిన్. [8-733]

సత్యవ్రతుడికీ, ఆయనకూడా ఉండే సప్తర్షులకీ బ్రహ్మజ్ఞానం ఇచ్చాక వేదాలు తీసుకొచ్చి బ్రహ్మ కి ఇవ్వాలి. అంటే మొదటి పని "భక్తపాలన కళాసంరంభకున్...." అనేది అయింది. తర్వాతది "దానవోద్రేక స్థంభకున్..." అది ఈ పద్యంలో చెప్తున్నాడు. ఇందులో దానవుడు వేదాలు తస్కరించిన దొంగరక్కసుడు హయగ్రీవుడు కనక ఆఖరి పాదంలో ఆయన పదం కనిపిస్తుంది. వేదాలు అయ్యో అని దైన్యంగా అరుస్తూంటే, మొహం సాచి, తోక సారించి మీసాలు అదురుతూ ఉండగా మీనాకృతిలో ఉన్న విష్ణువు ఆ వంచకుణ్ణి (కరటిన్) వధించాడు. ఇదైనా ఎప్పుడంటే బ్రహ్మకి రాత్రి గడిచేవరకూ (బెనురేయి నిండునంతకు) ఆ నీటిలో మీనరూపధారుడైన (జలచరాకారుండగు) నారాయణుడు విహరించాక.

ఈ దశావతార కార్యాలలో జరిగేవి జాగ్రత్తగా గమినిస్తే అనేక పనులు ఒక అవతారంలో చేయడం గమనించవచ్చు. కృష్ణావతారంలో ధర్మస్థాపన అంటే పూతనతో మొదలైన రాక్షస సంహారం చివరకి యాదవ వంశం అంతరించేవరకూ సాగుతుంది. అలాగే త్రేతాయుగంలో కూడా రావణ వధ ఒకటే కాక అనేకమందికి (తాటకి, అహల్య, శబరి, ఖర, దూషణ వగైరా) ముక్తి కలగడం చూడవచ్చు. ఇదే విషయం జరాసంధుడి మీదకి భీమార్జునలకి పంపుతూంటే అక్రూరుడు కృష్ణుడితో చెప్తాడు, 'నువ్వు వీళ్ళిద్దరితో బ్రాహ్మణవేషంలో వెళ్ళి వాణ్ణి కడతేర్చితే మరోసారి యుద్ధం చేయక్కర్లేదు, రాజసూయం, వాడి పీడ వదలడం అనే రెండు పనులూ ఒకేసారి అయిపోతాయి,' అంటూ. ఇదే విధంగా అనేకపనులు ఒక అవతారంలో జరగడం; వచ్చే మన్వంతరానికి మనువుని నిర్ణయించడం, హయగ్రీవుణ్ణి కడతేర్చి వేదాలని బ్రహ్మకి అప్పగించడం అనేవి ఈ అవతారంలో చూస్తాం.

సీ. ఎప్పుడు వేగునం చెదురు చూచుచునుండు
మునుల డెందంబులం ముదము నొందఁ,
దెలివితోఁ బ్రక్క నిద్రించు భారతి లేచి-
యోరపయ్యెదఁ జక్క నొత్తి కొనఁగ,
మలినమై పెనురేయి మ్రక్కిన తేజంబుఁ-
దొంటి చందంబునఁ దొంగలింపఁ,
బ్రాణుల సంచితభాగధేయంబులుఁ-
గన్నుల కొలకులఁ గానఁబడఁగ [8-735]

తే. నవయవంబులుఁ గదలించి, యావులించి
నిదురఁ దెప్పఱి, మేల్కాంచి, నీల్గి, మలఁగి,
యొడలు విఱుచుచుఁ గనుఁగవ లుసుముకొనుచు.
ధాత గూర్చుండె సృష్టి సంధాత యగుచు. [8-735.1]

ఈ నైమిత్తిక ప్రళయం ఎప్పుడు పూర్తి అవుతుందా అని వేచి చూస్తున్న మునుల (కొత్తగా నియమింపబడిన సప్తర్షులు) ఎదురుచూస్తున్నప్పుడు, బ్రహ్మ లేచాడు నిద్రలోంచి, కళ్ళు నలుపుకుంటూ. అలా లేచినవాడికి పోయిన ప్రాణులు

చేసిన పాప పుణ్యాలు (సంచితభాగధేయంబులు) కనిపించాయి. వాటి ప్రకారం సృష్టి జరగాలి. లేచి వళ్ళు విరుచుకుని విధాత తన చోటులో కూర్చున్నాడు సృష్టి చేయడానికి.

పైన తేటగీతి పద్యంలో ధాత అంటే బ్రహ్మ అనే పదాన్ని సృష్టి చేసేవాడు (సంధాత) అని ఎంత చమత్కారంగా చెప్పాడో చూసారా పోతన? అలాగే మనం పొద్దుటే లేవగానే వళ్ళు విరుచుకున్నట్టూ ఆయన కూడా ఇలాగే లేచాడు అంటున్నాడు. అది అలా ఉంచితే, జీవుల పాపపుణ్యాలు బ్రహ్మకి కనిపించాయి అన్నాడు కదా? ఇవే పురంజనోపాఖ్యానంలో లింగశరీరానికి అంటుకుని ఉండే కర్మలు అని చెప్పుకున్నాం. వాటి ప్రకారం మరో జన్మ కలుగుతుందనేది వప్పుకున్నాం కనక సృష్టి ఆ విధంగా జరగడానికి బ్రహ్మ పూనుకున్నాడు. అయితే ధర్మం ఇదీ అని చెప్పే వేదాలు ఇంకా చేతిలోకి రాలేదు.

ఆ. వాసవారిఁ జంపి వాని చేఁ బడియున్న
వేదకోటి చిక్కు విచ్చి తెచ్చి
నిదుర మాని యున్న నీరజాసనునకు
నిచ్చెఁ గరుణతోడ నీశ్వరుండు. [8-737]

హయగ్రీవుణ్ణి (వాసవారి; వాసవుడు-ఇంద్రుడు, వారి-శత్రువు లేదా రాక్షసుడు) చంపి వాడి చేతిలో ఉన్న వేదకోటి పట్టుకొచ్చి నిద్ర మాని ఉన్న బ్రహ్మదేవుడికి (నీరజాసనుడు – నీరజ-పద్మం, ఆసనుడు-ఆసనంగా కలవాడు) ఇచ్చాడు భగవంతుడు. అలా విధాతకి మరో పగలు మొదలైంది. మొదట్లో విష్ణువు తెల్లని వరాహమైన రూపుతో భూమిని ఉద్ధరించాడు కనక మనం ఉన్నది శ్వేత వరాహ కల్పం, సత్యవ్రతుడు వైవశ్వతుడిగా పుట్టిన మన్వంతరం. ఇది పూజలో సంకల్పం చెప్పేటప్పుడు గమనించవచ్చు.

క. జలరుహనాభుని కొఱకై
జలతర్పణ మాచరించి సత్యవ్రతుఁ డా
జలధి బ్రతికి మను వయ్యెను;
జలజాక్షునిఁ గొలువ కెందు సంపదఁ గలదే? [8-738]

మొదట్లో సత్యవ్రతుడు ఏటి వొద్దుకి శ్రీహరికి (జలరుహ నాభుడు) జలతర్పణం చేయడానిక్కదా వెళ్ళాడు? ముడుపులూ అవీ ఏమీ చెల్లించలేదు, మనసు పెట్టి 'పత్రం, పుష్పం, ఫలం, తోయం' అన్నట్టూ జలం మాత్రమే తర్పణం చేసాడు. అయినా ప్రళయంలోంచి బతికి బయటపడి మనువయ్యాడు. భగవంతుణ్ణి (జలజాక్షుని, పద్మాలవంటి కన్నులు కలవాడు) ఆశ్రయిస్తే కలగని సంపద లేదు కదా?

ఆ. జనవిభుండు దపసి సత్యవ్రతుండును
మత్స్యరూపి యైన మాధవుండు
సంచరించినట్టి సదమలాఖ్యానంబు
వినిన వాఁడు బంధ విరహితుండు. [8-739]

ఇది మత్స్యావతారం చదివినందుకు ఫలస్శృతి – శుకమహర్షి పరీక్షిత్తుతో చెపుతున్నాడు. ఈ పద్యంలో కూడా తెలుగు పదాలు గమనించండి. జనవిభుండు (జనాలకి రాజు), తపసి అయిన సత్యవ్రతుడు, మీనాకారం ధరించిన మాధవుడు ఉన్న (సంచరించినట్టి) ఈ కథ (సదమలాఖ్యానంబు; సత్-మంచి, అమల-స్వచ్ఛమైన, ఆఖ్యానం-కథ) విన్నవారందరూ బంధాలనుంచి విముక్తులు. బంధాలంటే ఈ సంసారం (జననం, మరణం, రోజూ ఉండే కోరికలు వగైరా). సరే ఓ సారి చదివి వినేస్తే బంధ విముక్తి అయిపోయి కైవల్యం వచ్చేస్తుందా అని అడిగేవారికి కిందన ఇచ్చిన ఆఖరి పద్యంతో మత్స్యావతార కథ సమాప్తం చేస్తున్నాడు.

క. హరి జలచరావతారముఁ
బరువడి ప్రతిదినముఁ జదువఁ బరమపదంబున్
నరుఁ డొందు వాని కోర్కులు
ధరణీశ్వర! సిద్ధిఁ బొందుఁ దథ్యము సుమ్మీ. [8-740]

ఈ శ్రీహరి జలచరావతారం రోజూ చదివితే మనుషులకి పరమపదం లభిస్తుంది. కారణం ఏమంటే రోజూ చదువుతూ ఉంటే ఓ రోజుకి భక్తి కుదురుతుంది. మెల్లిగా కోరికలు అణిగి సిద్ధి కోసం ప్రయత్నం మొదలు పెడతారు కదా, అలా కొన్నాళ్ళకి ముక్తి కలగవచ్చు.

మ. ప్రళయాంభోనిధిలోన మేన్మఱచి నిద్రంజెందు వాణీశు మో
ముల వేదంబులుఁ గొన్న దైత్యుని మృతిం బొందించి సత్యవ్రతుం
డలరన్ బ్రహ్మము మాటలం దెలిపి సర్వాధారుఁడై మీనమై
జలధిం గ్రుంకుచుఁ దేలుచున్ మెలఁగు రాజన్మూర్తికిన్ మ్రొక్కెదన్. [8-741]

ఇది మొత్తం కథాసారం అంతా చెప్పే చివరి పద్యం. కల్పాంతంలో వళ్ళు మరచి నిద్రిస్తున్న బ్రహ్మనుంచి వేదాలని ఎత్తుకుపోయిన హయగ్రీవుణ్ణి వధించి సత్యవ్రతుడినీ, మిగతా మునులనీ రక్షించిన, నీటిలో మునుగుచూ తేలుతూ ఉన్న మీనావతారుడికి నమస్సులు. ఈ మత్స్యావతారం కథ ముగించేముందు శ్రీహరి మీద ఈ శ్లోకం గుర్తుతెచ్చుకుందాం.

జ్ఞానానందమయం దేవం నిర్మలం స్ఫటికాకృతిం |
ఆధారం సర్వవిద్యానాం హయగ్రీవముపాస్మహే ||

జ్ఞానం, ఆనందం అనేవి భగవంతుడి లక్షణాలు, అన్ని విద్యలకీ మూలమై హయగ్రీవుడైనవాడికి నమస్కారం. ఈ శ్లోకంలో హయగ్రీవుడు అంటే విష్ణువు, మత్స్యావతారంలో చెప్పుకున్న రాక్షసుడు కాదు. ఆయన హయగ్రీవావతారం ఎత్తినది దేవీ భాగవతంలో మరో కథ. బ్రహ్మం అంటే శివానందులు చెప్పినట్టూ 'ఏది తెలుసుకుంటే ఇంకేమీ తెలుసుకోనక్కర్లేదో అదే బ్రహ్మం.' అందుకే అది ఆధారం సర్వ విద్యానాం. అన్ని విద్యలకీ మూలకారణమైనది. ఇది దొరికేచోటు భగవంతుడి సన్నిధి మాత్రమే. అది ఇవ్వగలిగేది ఈ వ్యాసపరంపరలో చెప్పినట్టూ భగవంతుడు మాత్రమే కనక ఆయన పోతన అన్నట్టూ బ్రహ్మ విద్య తెలిసిన పురాణపురుషుడు, సనాతనమైన సాంఖ్యయోగ క్రియా సంహితమైన బ్రహ్మజ్ఞనం తెలిసినవాడు. వచ్చే వ్యాసంనుంచీ మరో భాగవత కథ తెలుసుకుందాం.

పోతన భాగవతం ఇక్కడ చూడవచ్చు: http://telugubhagavatam.org/

(కొనసాగింపు వచ్చే సంచికలో)

COMMENTS